# తమ ధన యజ్ఞానికి కార్మికులను
# బలి ఇస్తున్న బడా నిర్మాణ కంపెనీలు

**ఇటీవలి** కాలంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్మితమవుతున్న నూతన రాజధాని ప్రాంతంలో సంభవిస్తున్న నిర్మాణరంగ కార్మికుల 'ప్రమాద మరణాల' ఘటనలు – రాష్ట్ర పాలకులు, రాష్ట్రప్రభుత్వం అమలుజరుపుతున్న కుటిలమైన ప్రజా, కార్మిక–వ్యతిరేక విధానాలను, దమననీతినీ బట్టబయలు చేస్తున్నాయి.

గత నాలుగైదు నెలలుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనను తాను భవన నిర్మాణరంగ కార్మికుల 'రక్షకుడిగా', వారి సంక్షేమాన్ని పట్టించుకొంటున్న నేతగా భారీఎత్తున ప్రచారం చేయించుకొంటున్నాడు. ఈ ప్రచారం ఎంతటి బూటకమైనదో, నిర్మాణరంగ కార్మికుల 'ప్రమాద మరణాల' వైనాలు వెల్లడి చేస్తున్నాయి.

నిర్మాణరంగ కార్మికులకు కనీస వేతనాలను యిప్పించటం విషయంలో, వారికి చట్టపరంగా పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ. లాంటి సౌకర్యాలను కల్పించే విషయంలో, వారికి సమంజసమైన జీవన–పనిపరిస్థితులను కల్పించటంలో, వారికి భద్రతా ఏర్పాట్లతో కూడిన పనిపరిస్థితులను కల్పించటంలో, వారికి చట్టపరమైన పనిగంటల పనిదినాన్ని అమలు జరిపించటంలో అటు ముఖ్యమంత్రికానీ, యిటు చట్టాలను అమలుచేయవల్సిన ప్రభుత్వశాఖలూ–యంత్రాంగాలుకానీ అణుమాత్రం ప్రయత్నించకుండానే, యీ సమస్యలను పట్టించుకోకుండానే, రియల్టర్లచేతా, బడాకాంట్రాక్టర్లచేతా నికృష్టంగా దోచుకోబడటాన్ని కొనసాగనిస్తున్నారు. ఈ నిర్మాణరంగ కార్మికులకు లభించే అతి స్వల్ప కూలీ డబ్బు నుంచి, కొంతమొత్తాన్ని ప్రీమియం మొత్తంగా, ఒకబీమా పథకంలోకి వసూలుచేసి, ఆ కూలీలను ఆ బీమాపథకంలో సభ్యులుగాచేసే బీమా–ప్రమోటరు ఏజెంటుగా వ్యవహరిస్తూ, ఆ బీమా పథకానికి 'చంద్రన్న–బీమా' అనే పేరుతో, ప్రభుత్వ యంత్రాంగాన్ని, ఆ పనిలో నియమించటమన్నదే యీ భవన నిర్మాణరంగ కార్మికుల 'రక్షకుడు' సాగిస్తున్న మహత్కార్యం! ఇటువంటి ప్రచారం మాటున నిర్మాణరంగ కార్మికుల శ్రమశక్తిని బడాకాంట్రాక్టర్లు, రియల్టర్లు అమానుషంగా, నిర్దాక్షిణ్యంగా, నికృష్టంగా దోపిడీచేసుకోవటాన్ని అనుమతిస్తూ, ప్రోత్సహించటమన్నదే యీ కార్మిక 'రక్షకుడి' ప్రభుత్వం అమలుజరుపుతున్న విధానం. ఈ బూటకాన్ని నిరసించిన, ప్రశ్నించిన వారిపై దారుణ దమనకాండను జరిపించటమే, 'ప్రజాస్వామ్య' యుతంగా రాష్ట్రప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న యీ కార్మిక 'రక్షకుడి' పాలనా నైజం!

కరువువాతపడి ప్రజలు మలమలామాడిపోతున్నా, గుక్కెడు త్రాగునీరు కూడా దొరకక వేలాది గ్రామాల ప్రజలు అల్లల్లాడిపోతున్నా, వందలాదిమంది రైతులూ, నేతకార్మికులూ బలవంతపు పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకొంటున్నా, విధిలేని ఆర్థిక పరిస్థితుల్లో కుటుంబాలకు కుటుంబాలే ఆత్మహత్యలు చేసుకొంటున్నా, జీవనోపాధికోసం లక్షలాది గ్రామీణ కుటుంబాలు సుదూర ప్రాంతాలకు వలసల బాటపడ్తున్నా, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతూ సామాన్య ప్రజానీకానికి అందుబాటులో లేకున్నా, ఆఖరుకు పచ్చిమిర్చి ధర కిలో 120 రూపాయలుదాటి గగనకుసుమమై పోయినా, యివన్నీ ఈ రాష్ట్రపాలకుడికి పట్టించుకోనవసరంలేని, పరిష్కరించాల్సిన అవసరంలేని అల్పమైన విషయాలే!

తక్షణం అమరావతిలో ప్రపంచశ్రేణి నూతన రాజధానిని నిర్మించటం, తాత్కాలిక సచివాలయం నిర్మించటమన్నదే – ఈ రాష్ట్రపాలకునికి ప్రధాన సమస్య! దీన్ని విజయవంతంగా పూర్తిచేయటమన్నది అతడికీ, అతడి ప్రభుత్వానికి ఒక ప్రతిష్ఠాత్మక సమస్య! ఈ విధానంయొక్క హేతుబద్ధతను ప్రశ్నించిన వారందరిని రాష్ట్ర అభివృద్ధి వ్యతిరేకులుగానూ, రాష్ట్రవ్యతిరేకులుగానూ ముద్రవేయటమన్నదే, రాష్ట్రమంత్రివర్గానికీ, చంద్రబాబు వందిమాగధులకూ నేటి పవిత్ర కర్తవ్యం!

ఇటువంటి దారుణ పరిస్థితుల్లో, ప్రజా, కార్మిక – వ్యతిరేక విధానాలు అమలుజరుగుతున్న ఈ రాష్ట్రంలో, యీ మధ్యకాలంలో ఘోరమైన, దుర్మార్గమైన భవనరంగ నిర్మాణరంగ కార్మికుల మరణాలు సంభవించాయి.

తాత్కాలిక సచివాలయ నిర్మాణానికి కాంట్రాక్టర్లుగా బడాకాంట్రాక్టు నిర్మాణసంస్థలైన ఎల్అండ్ టి, షాపూర్జీ – పల్లోంజి కాంట్రాక్టు సంస్థలు ఎంచుకోబడ్డాయి. నిర్ణీత సమయంలో యివి ఆ నిర్మాణాన్ని పూర్తిచేయవలసివుంది. అందుకోసమని యీ సంస్థలు యితర రాష్ట్రాలైన పశ్చిమబెంగాల్, ఒరిస్సా, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, చత్తీస్ఘడ్ రాష్ట్రాలనుండి నిర్మాణరంగ కార్మికులను యిక్కడికి పనిలోకి తెచ్చి ఆ కార్మికుల శ్రమను నికృష్టంగా దోచుకొంటున్నాయి. కార్మిక చట్టాలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ప్రమాదకర పనుల్లో పాటించాల్సిన భద్రతా నియమాలను, చేయవల్సిన భద్రతా ఏర్పాట్లనూ ఉద్దేశ్యపూర్వకంగానే పాటించకుండా ఎగగొడ్తున్నాయి. బలవంతంగా రోజుకు 12 గంటలపాటు ఆ కార్మికులను దుర్భరమైన జీవన, పనిపరిస్థితుల్లో నిర్బంధించి పనిచేయించుకొంటున్నాయి. రెండు నెలలకు పైగా జీతాలను బకాయిపెట్టి – వారిని కట్టుబానిసలుగా చేసుకొని చాకిరీ చేయించుకొంటున్నాయి. ఈ బడాకంపెనీలకు గల పలుకుబడి, బడానేతలతోగల సంబంధాల వలన యీ బడాకాంట్రాక్టు కంపెనీలను – చట్టాలను అమలుజరపాల్సిన ప్రభుత్వశాఖల ఉన్నతాధికారులు సహితం కనీసం ప్రశ్నించే ధైర్యంకూడా చేయలేకపోయారు;

పోతున్నారు. ఆఖరికి 'చంద్రన్న బీమాపథకం'లో నిర్మాణరంగ కార్మికులను చేర్పించటంకోసం వెళ్ళిన కార్మికశాఖ అధికారులను సహితం, ఆ కంపెనీల హెచ్.ఆర్. డిపార్టుమెంటువారు, తమ ప్రయివేటు సెక్యూరిటీ గార్డులచేత బయటికి తరిమేస్తే కూడా ఏమీ చేయలేక మిన్నకుండిన వైనం, ఈ ధనాఢ్య వర్గాలకు ప్రభుత్వాధికారులను సహితం భయపెట్టగలిగేటంతటి ఎంతటి అధికారంవుందో స్పష్టంచేస్తుంది. ఇదేవిధంగా అటు రైతుల నుండి భూములను గుంజుకొంటున్న సి.ఆర్.డి.ఎ అధికారులుగానీ, యిటు ప్రజలపై నిరంతరం తమ ప్రతాపాన్ని చూపిస్తూ దమనకాండను జరిపే పోలీసు అధికారులుగానీ, ఆ బడా కాంట్రాక్టు కంపెనీల అధికారానికి భయపడుతూ, మదనపడుతున్న వైనం మీడియాలో వెల్లడిచేయబడుతూనే వుంది.

ఇటువంటి దారుణపరిస్థితుల్లో, ఏప్రియల్ నెలలో, తాత్కాలిక సచివాలయ నిర్మాణపనుల్లో పనిచేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన సామ్రాట్ రౌత్ అనే కార్మికుడు బోర్‌పైప్స్ వేస్తుండగా, మిషన్ తిరగబడిన ప్రమాదంలో మరణించాడు. అతడ్ని పనిలో నియమించుకొన్న షాపూర్‌జీ పల్లోంజీ కంపెనీ 8 లక్షల నష్టపరిహారం యిస్తామని ప్రకటించి, కేవలం 2 లక్షల రూపాయలు మాత్రమే అతడి కుటుంబ సభ్యులకు చెల్లించి చేతులు తుడిచేసుకొంది. చట్టాన్ని అమలుపరిచి ఆ కాంట్రాక్టు కంపెనీ యజమానులను అరెస్టుచేసి – కేసుపెట్టాల్సిన ప్రభుత్వశాఖలు, విభాగాలు – పోలీసులతోసహా ఆ బడాకంపెనీని పల్లెత్తుమాట అనటానికి సాహసించలేకపోయాయి.

తిరిగి మే 11న, ఉత్తరప్రదేశ్‌కు చెందిన దేవేంద్ర అనే కార్మికుడు కాంక్రీట్ మిక్సర్‌లో పడి మరణించాడు. ఈ విషయాన్ని ఎల్ అండ్ టి యాజమాన్యం గోప్యంగా వుంచి అతడి శవాన్ని అంబులెన్సులో బయటకు తరలించ ప్రయత్నించింది. దీన్ని గమనించిన యితర కార్మికులు ఆగ్రహంతో నిరసనకు దిగారు. పనిలోకి వెళ్ళకుండా నిరసన సాగించారు. తమపై నిర్బంధం ప్రయోగింపజూసిన పోలీసులను రాళ్ళతో ప్రతిఘటించారు; ప్రభుత్వ వాహనాన్ని బుగ్గిచేశారు.

ఇటువంటి ప్రమాదానికి కారకులయిన యాజమాన్యాన్ని అరెస్టుచేసి, శిక్షింపజేయాల్సిన పోలీసులు ఆ పనిచేయటానికి బదులు, నిరసనకారుల పైననే లాఠీఛార్జీ జరిపి, ఆ ప్రాంతంలో 144వ సెక్షను విధిస్తూ, తమ జులుంను చూపిస్తూ నిరసన ఆందోళన జరుపుతున్న కార్మికులను బెదిరించి, భయపెట్టి, అరెస్టులు జరిపి, ఆ కార్మికులను బలవంతంగా పనుల్లోకి పంపారు. అన్ని చట్టాలను బాహాటంగానే ఉల్లంఘించిన కాంట్రాక్టు సంస్థకు సేవక–రక్షకులుగా పనిచేశారు. బయటి వ్యక్తులు ఎవ్వరూ ఆ నిరసన ప్రదర్శనా ప్రాంతానికి చేరకుండా నిరోధించారు. నిరసన తెల్పుతున్న వామపక్ష నాయకులపై లాఠీఛార్జీ జరిపి బలవంతంగా అరెస్టుచేసి, బయటకు తీసుకుపోయారు. తమ యీ దమననీతి చర్యలను సమర్ధించుకొంటూ జిల్లా ఎస్.పి. "నిర్ణీతకాలంలో యీ ప్రముఖమైన భవన కాంప్లెక్సు నిర్మాణం జరుగుతోంది కాబట్టి, మేము యీ నిర్మాణపు పనులకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా చూశాం. అందువలన అటువంటి నిరసనలు లేదా ఎటువంటి 'అల్లర్ల'ను అనుమతించలేదు" అంటూ ఘనంగా ప్రకటించాడు.

ఇదీ భవన నిర్మాణరంగ కార్మికుల 'రక్షకుని' ప్రభుత్వ హయాంలో నిర్మాణరంగ కార్మికులకు లభించిన రక్షణ – సంక్షేమం!

కాకపోతే ఆగ్రహంలో వున్న కార్మికులను శాంతపరచటానికి గుంటూరు సబ్‌కలెక్టరు అనేక చర్చలుజరిపి, మరణించిన ఆ కార్మికుని కుటుంబానికి 20 లక్షల పరిహారాన్ని యిచ్చేట్టుగా ఎల్‌అండ్‌టి యాజమాన్యంచేత ప్రకటింపచేయటం జరిగింది. ఈ బడా కాంట్రాక్టు కంపెనీ ఎల్‌అండ్‌టికి, యిలా నిర్మాణ సందర్భంగా కార్మికులను బలియివ్వటం (తగు భద్రతా ఏర్పాట్లు, చర్యలూ తీసుకోకుండా) అలవాటైన విషయమే! గతంలో ఢిల్లీ మెట్రో నిర్మాణ సందర్భంలో కూడా 2010 నాటికి 109 మంది కార్మికులను – ప్రమాదాల మరణరూపంలో బలితీసుకొంది. భద్రతా ఏర్పాట్లకు వెచ్చించే మొత్తాలకన్నా, కార్మికులు నిరసన తెల్పిన – ఆందోళన జరిపిన సందర్భంలో యిలా నష్టపరిహారం ప్రకటించటమే, ఆ కంపెనీకి లాభకరంగా వుంటోందన్నమాట. ఇటువంటి మరణాలకుగాను ఉద్దేశ్యపూర్వక నేరపూర్వక నిర్లక్ష్యంతో వ్యవహరించే ఎల్‌అండ్‌టి అధిపతులను హత్యానేరం క్రింద శిక్షించాల్సింది పోయి – యీ రకంగా ఆదర్శ యాజమాన్యంగా, చట్టాలను అమలుపర్చాల్సిన ప్రభుత్వాలే వ్యవహరించటం, ఈ ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక స్వభావాన్ని తేటతెల్లం చేస్తోంది.

ఈ ప్రమాదాలపై జరిగిన ఆందోళన చల్లారకముందే తిరిగి మే 14న గుంటూరు నగరంలో, ఒక బడారియల్టరయిన బిల్డరయిన చుక్కపల్లి రమేష్ యాజమాన్యంలోని ఓ సంస్థ నిర్మించే ఒక వాణిజ్య సముదాయ నిర్మాణ పనులలో పునాదులు తీస్తున్న సమయంలో మట్టిపెళ్ళలు విరిగిపడి ఏడుగురు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ కార్మికుల్లో చదువుకొంటున్న విద్యార్థులు కూడా వున్నారు. ఈ బిల్డర్ తగు భద్రతా చర్యలు–ఏర్పాట్లు చేయకుండా పునాదుల త్రవ్వకపు పనులు చేపట్టడం వల్లనే యీ ప్రమాదం – కార్మికుల మరణాలు సంభవించాయన్నది నిస్సందేహం. అయినా చట్టాలను అమలుజరపాల్సిన ప్రభుత్వాధికారులు, పోలీసులూ –మరణించిన భవన నిర్మాణ కార్మికుల బంధువులు ఆందోళనజరిపినా – ఆ బిల్డర్‌ను కానీ, ఆ నిర్మాణపు పనులను పర్యవేక్షిస్తున్న యింజనీర్లనుకానీ అరెస్టు చేయకపోవటం అన్నది కాకతాళీయంగా జరిగిన పొరపాటు ఎంతమాత్రమూకాదనీ, ప్రభుత్వమూ –పోలీసులూ–పాలకులూ ఉద్దేశ్యపూరిత నేరపూరిత నిర్లక్ష్యానికి పాల్పడిన నిర్మాణసంస్థ యాజమాన్యానికి సేవకులు–మద్దతుదారులుగానే వున్నారనే వాస్తవం వెల్లడవుతోంది. కేవలం రియల్టర్ యొక్క లైసెన్సును రద్దుచేయటం, ఆ ప్రాంత బిల్డింగ్ యిన్స్పెక్టరును సస్పెండుచేయటం, భవనానికి సాంకేతిక సలహాదారుని, స్ట్రక్చరల్ ఇంజనీర్‌ల లైసెన్సులను రద్దుచేయటం లాంటి చర్యలద్వారా, యీ దుర్మరణానికి కారకులపై ప్రజలకున్న ఆగ్రహాన్ని ఉపశమింపచేసే చర్యలకు పూనుకొన్నారని అర్థమవుతోంది.

ప్రమాదంలో బలితీసుకోబడ్డ భవన నిర్మాణరంగ కార్మికులపట్ల, ముఖ్యమంత్రి 'కార్మిక రక్షకుడూ' అయిన చంద్రబాబునాయుడికి అతడి ప్రభుత్వానికీ కార్మికుల సంక్షేమంపట్ల ఎంతటి పట్టనితనం వుందో యీ ఘటనలు మరోసారి స్పష్టంచేస్తోన్నాయి.

భవన నిర్మాణరంగ కార్మికుల మరణాలకు చెందిన పై ఘటనలన్నీ – చట్టాలుగానీ, చట్టాలు అమలుజరపాల్సిన ప్రభుత్వశాఖలుకానీ, పాలకులు కానీ, నేరస్థులను పట్టుకొని శిక్షించటానికని ఉద్దేశింపబడిన పోలీసు వ్యవస్థకానీ – ధనాఢ్యవర్గాల, వారి ప్రయోజనాల పరిరక్షణకోసమే రూపొందింపబడి, ఆ వర్గాలకే సేవకులుగా వున్నాయనీ, కార్మికులకు గానీ, ప్రజలకుగానీ వారి ప్రయోజనాలకుకానీ అవి పూర్తిగా వ్యతిరేకమయిన వ్యవస్థలనీ మరింతగా స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యేకించి తాను ప్రచారం కావించుకొంటున్నట్టుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు–అతడి ప్రభుత్వమూ భవన నిర్మాణరంగ కార్మికుల 'రక్షకులు' ఎంత మాత్రమూ కాదనీ స్పష్టం చేస్తున్నాయి. అంతేకాక కీలక సందర్భాలలో ధనాఢ్య వర్గాల రక్షణకోసం, బాధిత ప్రజలపైనా, కార్మికులపైనా నిర్దాక్షిణ్యంగా యీ ప్రభుత్వాలూ, పాలకులు దారుణ దమనకాండకు పాల్పడుతున్నారని కూడా యీ ఘటనలు తెలియచేస్తున్నాయి.

ధనాఢ్య పాలకవర్గాలూ – పాలకులూ – ప్రభుత్వాల యొక్క యీ ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక దోపిడీవర్గ స్వభావాన్నీ కార్మికులూ, ప్రజలూ అర్థం చేసుకొని ఐక్యంగా యీ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలి!

oooooo